RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | శుక్రవారం 12-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 256 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

# ఒక్కో పనికి ఒక్కో రేటు..!

విద్యుత్ శాఖలో అవినీతి వ్యవహారాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త విద్యుత్ కనెక్షన్లు, డీటీఆర్‌ల ఏర్పాటు, లైన్ల మార్పిడి, అదనపు లోడ్ మంజూరు వంటి పనుల్లో అధికారుల అనుమతులు పొందాలంటే వినియోగదారులు భారీ మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "డబ్బులు ముట్టజెప్పితేనే ఫైల్ కదులుతుంది" అనే పరిస్థితి దక్షిణ డిస్కం పరిధిలోని పలు సర్కిళ్లలో నెలకొన్నట్లు సమాచారం.

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో పాటు కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు సీఎండీ జితేశ్ వీ పాటిల్ ఇంజినీర్లకు నిధుల మంజూరు అధికారాలను పెంచుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ నిర్ణయం ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి కొందరు అధికారులకు అవినీతికి కొత్త మార్గాలు తెరిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2లో






## తొలి వానకే చేతులెత్తేసిన సర్కార్: కేటీఆర్

నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్‌లో భారీగా కురిసిన తొలి వాన

చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయన్న కేటీఆర్

కాంగ్రెస్ సర్కార్ కేవలం రాజకీయాలపైనే దృష్టి పెడుతోందని విమర్శ

3లో



# ఏఐపై పట్టుసాధించండి

సైబర్ నేరాలను అరికట్టండి

మాదకద్రవ్యాల పీచమణచండి

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వండి

నీతి ఆయోగ్ భేటీలో రాష్ట్రాలకు ప్రధాని దిశానిర్దేశం

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ 11వ పాలకవర్గ సమాశంలో రాష్ట్రాలకు దేశం ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, రాబోయే సువర్ణావకాశాలపై ప్రధాని మోదీ దిశానిర్దేశంచేశారు. 28 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో గంటల తరబడి సుదీర్ఘంగా మోదీ సమావేశమై పలు అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించి ఫిర్యాదులు,

3లో

## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు..

### 'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి

కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు పేరు చిక్కులు

'టీఆర్ఎస్' పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్

మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు

కవిత పార్టీ పేరుపై ఈసీకి వందలాది ప్రజా అభ్యంతరాలు

వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘాన్ని కలవనున్న కవిత ప్రతినిధులు




కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్'

3లో

# అమెరికా దుశ్చర్య!

భారత సిబ్బంది ఉన్న మూడు నౌకలపై దాడులు

ఒమన్ సమీప సెటెబె చమురునౌకపై

దాడి ఘటనలో ముగ్గురు భారతీయుల దుర్మరణం

మృతుల్లో ఆంధ్రప్రదేశ్ వాసి

దాడులను తీవ్రంగా ఖండించిన భారత్

ఎంటీ జల్‌వీర్ నౌక మీదా దాడి

అందులోని 20 మంది భారతీయులు సురక్షితం

3లో

విశాఖపట్నం: ఇరాన్‌పై ముమ్మర దాడులకు తెగించిన అమెరికా బుధవారం ఒమన్ సమీప హోర్మూజ్ జలసంధి సముద్రజలాల్లోని ఎంటీ సెటెబె చమురురవాణా నౌకపై జరిపిన దాడిలో ముగ్గురు



# హైదరాబాద్‌కు రూ.లక్ష కోట్లివ్వండి

హైదరాబాద్ సహా ఆరు మెట్రో నగరాల అభివృద్ధికి ఎం--6 టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయండి

నీతి ఆయోగ్ ముందు ప్రతిపాదించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవానికి సహకరించాలని వినతులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తులుగా నిలుస్తున్న ఆరు మెట్రో నగరాల సమగ్ర అభివృద్ధికి ఎం--6 టాస్క్‌ఫోర్స్ పేరుతో ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ నగరాలను ప్రపంచ ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు ఒక్కో మెట్రో నగరానికి రూ. లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ. 6 లక్షల కోట్లు కేటాయించాలని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా హైదరాబాద్



3లో

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి

తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్టు పొంగులేటి వెల్లడి

దీని ద్వారా శిథిలావస్తలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి

భవనాల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

## డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

అన్యాయన్ని ప్రశ్నించే వారంతా కాక్రోచ్‌లే

మయరోమారు విమర్శలు గుప్పించిన జగన్

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# ఒక్కో పనికి ఒక్కో రేటు..!

### మేడ్చల్ జోన్‌లో అక్రమాల మయం


మేడ్చల్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్టిమేషన్లు లేకుండానే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్ల నిర్మాణం, అక్రమ లేఅవుట్లకు కనెక్షన్లు ఇవ్వడం వంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. కీసర, రాంపల్లి, దొమ్మర పోచంపల్లి, రాజరాజేశ్వరీనగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ అవసరం లేకున్నా ఎస్టిమేషన్లు తయారు చేయడం, మరోచోట ఎస్టిమేషన్‌లో పేర్కొన్న దానికంటే అనేక రెట్లు ఎక్కువ స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. బినామీ కాంట్రాక్టర్ల పేర్లతో కొందరు ఇంజినీర్లే పనులు దక్కించుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

### ఫైల్‌ను బట్టి ఫిక్స్‌డ్ రేట్లు

రంగారెడ్డి జోన్ పరిధిలో కొత్త కనెక్షన్లు, డీటీఆర్‌ల మార్పిడి, లైన్ విస్తరణ వంటి పనులకు సంబంధించిన ఫైళ్లకు ప్రత్యేక రేట్లు నిర్ణయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లే ఫైల్ అయితే మరో రేటు, స్థానికంగా పూర్తయ్యే పని అయితే మరో రేటు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. చిన్న పనులకే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని, పెద్ద పనులైతే లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నాయనే ప్రచారం శాఖలో జోరుగా సాగుతోంది.

### మెట్రో జోన్‌లోనూ అదే పరిస్థితి

మెట్రో జోన్ పరిధిలోనూ విద్యుత్ పనుల కోసం అధికారులకు ముట్టజెప్పాల్సిందేనని కాంట్రాక్టర్లు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. డీటీఆర్‌ల మార్పిడి, లైన్ల విస్తరణ, అదనపు లోడ్ మంజూరు వంటి దాదాపు ప్రతి పనిలోనూ అవినీతి వ్యవహారాలు కొనసాగుతున్నాయని సమాచారం. నిధుల మంజూరు పరిమితి పెరగడంతో కొందరు అధికారులు తమ పరిధిలో లేని పనులను కూడా ఇప్పుడు నిర్వహించే అవకాశం రావడంతో అవినీతికి మరింత అవకాశం లభించిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.




### అధికారాల పెంపు.. అవినీతికి అడ్డుకట్ట పడుతుందా?

క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలనే ఉద్దేశంతో సీఎండీ జితేశ్ వీ పాటిల్ చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లకు నిధుల మంజూరు అధికారాలను గణనీయంగా పెంచారు. డీఈల పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు, ఎస్ఈల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు, సీఈల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచారు. అయితే ఈ అధికారాల పెంపు అభివృద్ధికి దోహదపడుతుందా? లేక అవినీతికి మరింత ఊతమిస్తుందా? అన్న ప్రశ్న ఇప్పుడు విద్యుత్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

### అమలుకాని సీఎండీ ఆదేశాలు

ప్రజల సమస్యల పరిష్కారానికి సీఎండీ జారీ చేసిన పలు ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు లేవంటూ వినియోగదారులను తిరిగి కార్పొరేట్ కార్యాలయాలకు పంపుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ఒకవైపు అధికారులు పనులు చేయక ఇబ్బంది పెడుతుండగా, మరోవైపు ఫైళ్ల కోసం తిరుగుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది.

# హైదరాబాద్‌కు రూ.లక్ష కోట్లివ్వండి

నగరాభివృద్ధికి రూ. లక్ష కోట్లివ్వాలని కోరింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి భేటీలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రతిపాదనలు చేశారు. దేశ జనాభాలో దాదాపు 10 శాతం మంది హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు నగరాల్లో నివసిస్తుండగా దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో సుమారు పావు వంతు (25 శాతం) వాటాను ఇవే సమకూరుస్తున్నాయని.. అందువల్ల ఈ నగరాల అభివృద్ధిని సాధారణ వ్యయంగా కాకుండా, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి అవసరమైన వ్యూహాత్మక పెట్టుబడిగా చూడాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అదే సమయంలో రాష్ట్రంలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఆర్థిక, పరిపాలనా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి 3 ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థ.. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్--2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. '2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎస్‌జీడీపీ సాధించే రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం'అని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం పట్టణ, పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

**రాష్ట్రంలో విద్య, నైపుణ్యాభివృద్ధి విప్లవం...**

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టామని.. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా ప్రీ--ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్‌లో విద్య, భోజనం, రవాణా, డిజిటల్ లెర్నింగ్ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. 105 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు కోసం సుమా రు రూ. 24,000 కోట్ల వ్యయంతో ప్రణాళిక రూపొందించామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామ ని వివరించారు. 65 ఐటీఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తూ రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి కోర్సులు అందిస్తున్నామన్నారు. 26 వేలకుపైగా విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందించామని.. ఉపాధ్యాయుల కొరత తీ ర్చేందుకు 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు సీఎం వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్ గా తీర్చిదిద్దేందుకు హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయనుందని తెలిపారు.

**సీఎంలు వస్తే యంగ్ ఇండియా స్కూళ్లు చూపిస్తాం..**

ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి లేదా అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను చూడాలనుకుంటే సంతోషంగా చూపిస్తామని సీఎం చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా రూ. 2,100 కోట్ల పెట్టుబడి పెడుతోందన్నారు.

# కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు..

అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది. మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది. ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి



రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

అమరావతి:డీఎస్సీ నియామకాల అంశంపై మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మరోసారి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డీఎస్సీ అభ్యర్థులు యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల యువత నష్టపోతే ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ మాట్లాడుతూ.. 'ఎవరైనా మమ్మల్ని కాక్రోచ్ పార్టీ అని పిలుస్తారా లేదా అనేది పక్కన పెడితే.. డీఎస్సీ అభ్యర్థులు యువకులు. వారి భవిష్యత్తు, వారి ఉద్యోగ అవకాశాల గురించి మాట్లాడుతున్నాం. వారికి న్యాయం చేయకపోతే ప్రభుత్వం తన బాధ్యతను ఎలా నిర్వర్తించినట్లు అవుతుంది' అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని వైఎస్ జగన్ అన్నారు. యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ హక్కుల కోసం గళమెత్తడం సహజమని పేర్కొన్నారు. ప్రస్తుతం తరచూ ప్రస్తావనలోకి వస్తున్న 'జెన్ జీ' యువత కూడా ఈ వ్యవస్థలో భాగమేనని.. వారి ఆశయాలు, ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని వ్యాఖ్యానించారు. 'యువత కలలను, ఆశలను నలిపేస్తే కోట్లాది మంది ప్రజలు ఒకేసారి బయటకు వస్తారు. వారిని ఎవరైనా కాక్రోచ్‌లు అని పిలిస్తే, న్యాయం కోసం పోరాడే వారందరూ కాక్రోచ్‌లే అవుతారు. అలాంటి పోరాటంలో నేను కూడా వారిలో ఒకడిని' అని జగన్ అన్నారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, యువతకు అన్యాయం జరిగితే మౌనంగా ఉండబోమని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అభ్యర్థుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని, వారి భవిష్యత్తుతో ఆటలాడకూడదని సూచించారు. డీఎస్సీ అవకతవకలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దగా పడ్డ ప్రతి వర్గాన్ని కలుపుకుని ఉద్యమాన్ని మరింత బలంగా కొనసాగిస్తామని జగన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలపై రాష్ట్రంలో కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో మాజీ సీఎం జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

# ఏఐపై పట్టుసాధించండి

అభిప్రాయాలను స్వీకరించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వార్షిక సమావేశంలో 28 రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా సీఎంలనుద్దేశించి ఆయా రాష్ట్రాల్లో చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానాలపై మోదీ ప్రసంగించారు. "గోప్యత, పారదర్శకత, సామాజిక విలువలను పాటిస్తూనే కృత్రిమ మేధను విరివిగా ఉపయోగించండి. ఏఐతో అందివచ్చే అవకాశాలను ఒడిసిపట్టండి. అత్యంత తీవ్రమైన ఎల్ నినో వాతావరణ ఉపద్రవాన్ని తట్టుకునేలా విధానపర నిర్ణయాలు తీసుకోండి. నీటి సంరక్షణ చర్యలు చేపట్టండి. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూనే పలు రంగాల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు కృషిచేయండి. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగంలో స్వావలంబనకు బాటలువేయండి. పలు దేశాలతో భారత్ కొత్త వాణిజ్య ఒడంబడికలు చేసుకుంది. ఈ మేరకు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల పునరుజ్జీవనానికి పాటుపడండి. తద్వారా ఆయా రంగాల భాగస్వామ్యంతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించండి. సమాఖ్య స్ఫూర్తిని మరోసారి చాటండి. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయానికి పాటుపడండి. అప్పుడే రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెంది అభివృద్ధి చెందిన దేశంగా సాకారమవుతుంది. 'వికసిత్ భారత్'ఆవిర్భావం కోసం అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, బ్లాక్‌లు, గ్రామాల సంకల్పం తీసుకోవాలి. పౌర అవగాహన, సుపరిపాలన ద్వారా మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు వంటి వాటిని కట్టడిచేయండి. చక్కటి పరిపాలన, పారదర్శకత, మౌలిక వసతుల కల్పనతో పెట్టుబడులను ఆకర్షించవచ్చు. స్థానిక వస్తూత్పత్తుల బ్రాండింగ్‌పై దృష్టిపెట్టండి. సులభతర వాణిజ్యానికి తగ్గట్లు విధానపర నిర్ణయాలు తీసుకోండి.

డేటా సెంటర్లు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో కొత్త అవకాశాలను ఒడిసిపట్టండి. నవతరం ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యతనివ్వండి. భవిష్యత్ ఆర్థికవ్యవస్థకు నిపుణ మానవవనరుల అవసరం అత్యావశ్యకం. ఏఐను ఆ కోణంలో అవకాశాల గనిగా భావించండి. మన 70 కోట్ల యువత మనకు అతిపెద్ద ఆస్తి. ఇంతపెద్ద ఆస్తిని దేశాభివృద్ధి ఫలాలిచ్చే ఆదాయ వృక్షాలుగా మార్చండి. దేశంలో రక్షణరంగ ఉపకరణాల తయారీ రంగం వేగంగా విస్తరిస్తోంది. తగు మౌలికవసతుల్ని కల్పించి ఈ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచండి. జిల్లాకో విభిన్న ఉత్పత్తి తరహాలో ఎగుమతులే లక్ష్యంగా వ్యూహాలు రచించండి"అని రాష్ట్రాలకు మోదీ సూచించారు. సమ్మిళిత మానవాభివృద్ధి ఇతివృత్తంతో సమావేశం జరిగిందని తర్వాత నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అశోక్ లాహిరి తెలిపారు.

# అమెరికా దుశ్చర్య!

భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు ఆంధ్రప్రదేశ్ వాసిగా గుర్తించారు. వరసబెట్టి భారతీయ సిబ్బంది ఉన్న వాణిజ్యనౌకలపై అమెరికా దాడులు చేయడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛావాణిజ్యానికి భంగం కల్గించేలా కాల్పులు జరపడం చట్టవ్యతిరేకమని భారత్ పునరుద్ఘాటించింది. తక్షణం కాల్పుల పర్వానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని భారత్ సూచించింది. ఈ మేరకు ఇప్పటికే ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలోని ఉన్నతాధికారి, చార్జ్‌డిఅఫైర్స్ జేసన్‌ను పిలిపించి భారత్ తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఎంటీ సెటెబె నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయులు గల్లంతైనట్లు బుధవారం వార్తలొచ్చాయి. అయితే వాళ్లు ప్రాణాలు కోల్పోయారని, వాళ్ల మృతదేహాలను స్వాధీనంచేసుకున్నామని భారత నౌకాయాన మంత్రి శర్బానంద సోనోవాల్ గురువారం ప్రకటించారు. వాళ్ల కుటుంబాలకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ అన్నివేళలా అండగా ఉంటారని మంత్రి భరోసా ఇచ్చారు. సెటెబెపై దాడిలో మిగతా 21 మంది భారతీయ సిబ్బందిని ఒమన్ తీరగస్తీ బలగాలు కాపాడాయని మంత్రి వెల్లడించారు. 24 మంది భారతీయ సిబ్బంది ఉన్న మరో చమురు రవాణా నౌక మారీవెక్స్‌పై అమెరికా దాడిలో మొత్తం 24 మందినీ కాపాడటం తెల్సిందే. భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడులపర్వం గురువారమూ కొనసాగింది. ఒమన్‌లోని షినాస్ నౌకాశ్రయం సమీప జలాల్లో ఉన్న ఎంటీ జల్‌వీర్ నౌక పైనా అమెరికా దాడులకు తెగించింది. ఈ నౌకలో 20 మంది భారతీయ నావికులున్నారు. గినియా బిసావూ దేశ జెండాతో వెళ్తున్న ఈ నౌక మీదకు అమెరికా తన యుద్ధవిమానం నుంచి రెండు హెల్‌ఫైర్ గైడెడ్ క్షిపణులను ప్రయోగించింది. ఇవి నౌక ఇంజిన్ రూమ్‌ను నాశనం చేశాయి. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైంది. ఒమన్ రాయల్ నేవీ దళాల సాయంతో నౌకలోని 22 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా తీసుకొస్తున్నామని మస్కట్ నగరంలోని భారతీయ రాయబార కార్యాలయం 'ఎక్స్'లో స్పష్టంచేసింది. గత నాలుగు రోజుల వ్యవధిలో భారతీయులున్న నౌకపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌దీర్ జైశ్వాల్ తెలిపారు. భారతీయ సిబ్బంది ఉన్నారని తెలిసీ దాడిచేశామని అమెరికా గురువారం తొలిసారిగా ఒప్పుకుంది. "ఎంటీ జల్‌వీర్ ఇరాన్ చమురును అనుమతిలేకుండా గల్ఫ్ ఆఫ్ ఒమన్ గుండా తరలిస్తోంది. దిశ మార్చుకోవాలని పదేపదే హెచ్చరించినా బేఖాతరు చేశారు.



## ప్రభుత్వం స్పందించాల్సిన తీరు ఇదేనా..?

### ఖమ్మం బాలిక ఘటనపై హరీశ్ రావు

**నేటి ప్రస్థానం:** గత 4 రోజుల క్రితం ఖమ్మం పట్టణంలో జరిగిన ఘటన అత్యంత హృదయ విదారకమైన ఘటన. సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి. అది అనుభవించిన వాళ్లకు ఆ కుటుంబానికి ఎంత దుఖం ఉంటుందో ఒకసారి మన గుండె మీద చేయి వేసుకొని ఆలోచిస్తే తెలిసి వస్తుంది. దీన్ని ప్రతీ ఒక్కరు కూడా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. ఖమ్మంలో మైనర్ అమ్మాయిపై జరిగిన సంఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం చాలా బాధాకరమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత 4 రోజుల క్రితం ఖమ్మం పట్టణంలో జరిగిన ఘటన అత్యంత హృదయ విదారకమైన ఘటన. సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి. అది అనుభవించిన వాళ్లకు ఆ కుటుంబానికి ఎంత దుఖం ఉంటుందో ఒకసారి మన గుండె మీద చేయి వేసుకొని ఆలోచిస్తే తెలిసి వస్తుంది. దీన్ని ప్రతీ ఒక్కరు కూడా ఖండించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, సమాజం, అందరూ కూడా ఆలోచించాల్సిన అవసరముందన్నారు హరీశ్ రావు. పాపం 12 ఏండ్ల స్కూల్‌కు వెళ్లే అమ్మాయి.. అభం శుభం తెలియని అమ్మాయి మీద ఇలాంటి సంఘటనలు జరిగితే ఇంతకు మనమెక్కడున్నాం. ఎటు పోతున్నామని బాధ కలుగుతుంది. కనీసం సంఘటన జరిగిన తర్వాత కూడా ప్రభుత్వ స్పందన ఎట్లా ఉందంటే చాలా బాధగా ఉంది. 12 ఏండ్ల అమ్మాయిపై ఇలాంటి సంఘటన జరిగితే ప్రభుత్వం స్పందించాల్సిన తీరు ఇదేనా..? అని నేనడుగుతున్నానన్నారు. అమ్మాయి తిరిగి నడవలేని పరిస్థితిలో ఉన్నది. అమ్మాయికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే ఫాస్ట్ ట్రాక్ కోర్టు పెట్టి, ఇలాంటి దారుణాలకు పాల్పడే మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## గోల్డెన్ అవర్‌లో తక్షణ సహాయం అందించాలి




**నేటి ప్రస్థానం:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా 'అరైవ్ అలైవ్'లో భాగంగా బుధవారం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి సీపీ కార్యాలయంలో కమిషనర్ బి.సుమతి నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీసీపీలు అనురాధ, మనోహర్ కలిసి రోడ్డు భద్రతా నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు గోల్డెన్ అవర్‌లో తక్షణ సహాయం అందించేందుకు నగర పౌరులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కమిషనరేట్ పరిధిలోని ఐదు ప్రధాన బ్లాక్ స్పాట్స్ కుంట్లూర్ టీ జంక్షన్, కొత్తగూడె ఎక్స రోడ్స్, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ జంక్షన్, ఉప్పల్ ఎక్స్ రోడ్స్, రేతిఫైల్ బస్‌స్టాంగ్ సిగ్నల్ ప్రాంతాలలో ఆయా డీసీపీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. 2025లో 50 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, ఆయా బ్లాక్స్ స్పాట్‌లలో 342 ప్రమాదాలు జరుగా అందులో 232 మరణాలు జరిగాయన్నారు. విజయవాడ జాతీయ రహదారిపై ఈ ఏడాదిలో 259 ప్రమాదాలు జరుగగా అందులో 17 మంది మృతి చెందారని వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ హవర్‌లో బాధితులకు చికిత్స చేయించాలన్నారు. రోడ్డు ప్రమాదాల బాధితులకు తక్షణ సహాయం చేసిన వారికి రహవీర్ స్కీమ్ కింద రూ.25 వేల రివార్డు అందుతుందని, అలాగే ప్రమాద బాధితులకు పీఎం రథ్ స్కీమ్ కింద దవాఖానాలు రూ.1.5 లక్షల విలువైన క్యాష్‌లెస్ చికిత్స అందిస్తాయని తెలిపారు

## ఇగ్నైట్ పేరుతో క్యూనెట్ కొత్త అవతారం

**5వేల కోట్ల భారీ కుట్ర భగ్నం చేశాం: సిపి సజ్జన్నార్**

హైదరాబాద్: గతంలో నిషేధానికి గురైన క్యూనెట్ సంస్థ సరికొత్తగా ఇగ్నైట్ పేరుతో అవతారమెత్తిందని సీపీ సజ్జనర్ తెలిపారు. ఆ సంస్థ చేయాలనుకున్న దాదాపు రూ.5వేల కోట్ల భారీ మోసం కుట్రను భగ్నం చేసినట్లు ఆయన వెల్లడించారు. గురువారం నిర్వహించిన మిడియా సమావేశంలో సీపీ మాట్లాడారు. ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్ గత 25 ఏళ్లుగా 'గోల్డ్ క్వెస్ట్', 'క్వెస్ట్ నెట్' 'క్యూనెట్'.. ప్రస్తుతం 'ఇగ్నైట్'గా పేరు మార్చుకుని అమాయకులను దోచుకుందని సీపీ వివరించారు. దేశంలో లక్షల్లో బాధితులున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మామిడిపండ్లు తిని అక్కాచె÷-లలెళ్లు చనిపోయిన ఘటనపై సీసీ సజ్జనర్ స్పందించారు. బాలికల అంతర్గత అవయవాల నమూనాలు భద్రపరచాలని ఆదేశించామని.. వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

# తొలి వర్షానికే చేతులెత్తేసిన ప్రభుత్వం..

## రేవంత్ అసమర్థత వల్లే హైదరాబాద్ ప్రజలకు అవస్థలు

### ముఖ్యమంత్రి తీరుతోనే నగరవాసులకు నరకయాతన

### ఆయన ధ్యాసంతా రాజకీయాలు, భూ కబ్జాలపైనే..

### 'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

**నేటి ప్రస్థానం:** తొలి వర్షానికే రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థత, బాధ్యతారాహిత్యంతో నగరవాసులు నరకయాతన అనుభవించాల్సి వచ్చింది' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వర్షంతో ఎదురైన ఇబ్బందులను చక్కదిద్దాల్సిన సీఎం, తొలి వానకే హైదరాబాద్ నగరం అతలాకుతలమైందని ఇంత నిర్లజ్జగా అంగీకరించడానికి సిగ్గనిపించడం లేదా? అని బుధవారం ఎక్స్ వేదికగా ఘాటుగా ప్రశ్నించారు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని, మున్సిపల్ శాఖ మంత్రి అనే విషయం కూడా రేవంత్‌రెడ్డి మరచిపోయినట్టున్నాడని ఎద్దేవా చేశారు. పొద్దంతా కాయకష్టంచేసి ఇండ్లకు తిరిగివెళ్లే సమయంలో కురిసిన వర్షానికి వాహనదారులు, ముఖ్యంగా ఆడబిడ్డలు అనేక కష్టాలు పడ్డారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సత్వర చర్యలు చేపట్టి గట్టెక్కించాల్సిన ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు.

**ముందస్తు చర్యల్లో విఫలం..**

వర్షానికి హైదరాబాద్‌వాసులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి నాలుగు గంటల పాటు నరకయాతన పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్కరంటే ఒక్కరూ స్పందించలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో ఏటా వానకాలం ముందు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకొనేవారని గుర్తుచేశారు. విపత్కర సమయంలో చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిపెట్టేవారని చెప్పారు. కానీ మున్సిపల్ మంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారని విరుచుకుపడ్డారు. చెత్తతో కూరుకుపోయిన డ్రైనేజీలు, సిల్ట్ పేరుకుపోయిన మురుగు కాలువలను శుద్ధి చేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. కేవలం రాజకీయాలు తప్ప ప్రజాసమస్యలు, నగర పరిస్థితిపై కనీసం ఒక్క సమీక్ష కూడా చేయకపోవడం శోచనీయమని ధ్వజమెత్తారు.





**సన్నద్ధత లేకే దారుణంగా పరిస్థితులు**

వర్షాకాల ప్రణాళిక సన్నద్ధతపై నిర్లక్ష్యం చేయడం వల్లే హైదరాబాద్ నగరంలో చిన్న వర్షానికే దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ లాంటి పకడ్బందీ ప్రణాళికలను అమలు చేసి నగరవాసుల కష్టాలు తీర్చామని ఆయన గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత మళ్లీ కథ మొదటికి తెచ్చిందని ఆరోపించారు. ఓ వైపు కరెంట్ కోతలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నా, మరోవైపు విద్యుదాఘాతంతో మరణాలు సంభవిస్తున్నా ఈ సర్కార్‌లో చలనం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజధానిలో విలువైన భూములను కబ్జా చేయడమే ఏకైక పనిగా పెట్టుకున్న రేవంత్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు హైదరాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్రానికే ఎకనమిక్ ఇంజిన్ అయిన హైదరాబాద్‌ను గాలికొదిలేసిన సీఎంకు, కాంగ్రెస్ పార్టీకి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని తేల్చిచెప్పారు.

# ప్రశ్నించే ధైర్యం ఇప్పటికీ ఉంది, కానీ ఓపిక తగ్గింది

## రాహుల్ రామకృష్ణ కామెంట్స్ వైరల్





**నేటి ప్రస్థానం:** టాలీవుడ్ నటుడు రాహుల్ రామకృష్ణ చేసిన కొన్ని సోషల్ మీడియా పోస్టులు ఇటీవల రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఉద్దేశించి ఆయన అడిగిన ప్రశ్నలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ కావడంతో పాటు, జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానుల నుంచి తీవ్ర స్పందనకు దారితీశాయి. ఎక్స్ వేదికగా రాహుల్ రామకృష్ణ కొన్ని ప్రశ్నలను సంధించారు.

టాలీవుడ్ నటుడు రాహుల్ రామకృష్ణ చేసిన కొన్ని సోషల్ మీడియా పోస్టులు ఇటీవల రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఉద్దేశించి ఆయన అడిగిన ప్రశ్నలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ కావడంతో పాటు, జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానుల నుంచి తీవ్ర స్పందనకు దారితీశాయి. ఎక్స్ వేదికగా రాహుల్ రామకృష్ణ కొన్ని ప్రశ్నలను సంధించారు. తాను పవన్ కళ్యాణ్ అభిమానినేనని, అందుకే ప్రజాప్రతినిధిగా ఆయనను ప్రశ్నించే హక్కు తనకు ఉందని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం (RTI) అమలు, వివిధ శాఖల్లో సమాచార బహిర్గతం, పీసా (ౡజుూౡ) చట్టం అమలు, 1/70 గ్రామసభ చట్టం అమలు పరిస్థితులు, అటవీకరణ కార్యక్రమాల ఫలితాలపై వివరణ ఇవ్వాలని కోరారు. తాను రాజకీయ విమర్శలు చేయడం కాదని, ప్రజలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు కావాలని మాత్రమే అడుగుతున్నానని పేర్కొన్నారు. రాహుల్ పోస్టులు వైరల్ కావడంతో పవన్ అభిమానులు, జనసేన మద్దతుదారులు పెద్ద ఎత్తున స్పందించారు. కొందరు ఆయనపై విమర్శలు గుప్పించగా, మరికొందరు సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రాహుల్ మరో ట్వీట్ చేస్తూ, "ప్రశ్నించినంత మాత్రాన నేను దేశద్రోహిని కాను" అని పేర్కొన్నారు. అలాగే తన సినిమాల్లోని ప్రముఖ డైలాగ్‌ను ప్రస్తావిస్తూ "నా వల్లే సమస్య అయితే నేనెళ్లిపోతా" అంటూ సరదా వ్యాఖ్య కూడా చేశారు. అయితే తర్వాత ఆయన చేసిన కొన్ని పోస్టులు ఎక్స్ టైమ్‌లైన్‌లో కనిపించకపోవడంతో అవి తొలగించారా అనే చర్చ మొదలైంది. మరోవైపు తనపై జరిగిన ట్రోలింగ్‌పై స్పందిస్తూ రాహుల్ మరోసారి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నేను అడిగిన ప్రశ్నలకు ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదు. గొడవలు, విమర్శలు, వ్యక్తిగత దూషణలు మాత్రమే వచ్చాయి. అందుకే వివాదం పెరగకూడదని అనుకున్నాను అని పేర్కొన్నారు. రాహుల్ రామకృష్ణపై కొందరు నెటిజన్లు వ్యంగ్యంగా స్పందిస్తూ, ఆయన మద్యం మత్తులో పోస్టులు పెడుతున్నారని కామెంట్లు చేశారు. దీనికి కౌంటర్‌గా రాహుల్ స్పందిస్తూ, "120 పదాల ట్వీట్ రాయాలంటే తప్పనిసరిగా మత్తులో ఉండాలని నమ్మే వారి కోసం ఎక్స్ ప్రత్యేకంగా బ్రీత్ అలైజర్ ఫీచర్ తీసుకురావాలి" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలపై ఓ నెటిజన్ వీడియో షేర్ చేశారు. దానిపై స్పందించిన మరో పవన్ అభిమాని రాహుల్ రామకృష్ణను ట్యాగ్ చేస్తూ "ఇప్పుడు ప్రశ్నించే ధైర్యం ఉందా?" అని ప్రశ్నించారు.

దీనికి రాహుల్ సమాధానంగా, "గతంలో కొన్ని సాధారణ ప్రశ్నలు అడిగినప్పుడు ఏం జరిగిందో అందరికీ తెలుసు. ప్రశ్నించే ధైర్యం ఇప్పటికీ ఉంది. కానీ ఇప్పుడు ఓపిక తగ్గింది. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఒంటరిగా నిలబడాల్సి వస్తోంది" అని పేర్కొన్నారు. రాహుల్ రామకృష్ణ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి. కొందరు ఆయన ప్రశ్నించే హక్కును సమర్థిస్తుండగా, మరికొందరు పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు.

## పరాకాష్టకు బిజెపి నీచ రాజకీయాలు

**ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు: జగ్గారెడ్డి**

హైదరాబాద్: దేశంలో బీజేపీ నీచ రాజకీయం పరాకాష్టకు చేరిందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. గడిచిన 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. విలువలను వదిలేసి, తీవ్ర దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణెళి దీనికి తాజా ఉదాహరణ అని అన్నారు. ఈ అప్రజాస్వామిక చర్యలను దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని... బీజేపీ చేస్తున్న ఈ అన్యాయపు రాజకీయాలకు కాలమే సమాధానం చెబుతుందన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అత్యంత అన్యాయంగా, నిబంధనలకు విరుద్ధంగా తిరస్కరించారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఉన్న అసెంబ్లీ సంఖ్యాబలం ప్రకారం.. బీజేపీకి దక్కేది కేవలం రెండు రాజ్యసభ సీట్లు మాత్రమేనని.. కానీ.. ఎలాగైనా సరే కాంగ్రెస్‌కు దక్కాల్సిన రాజ్యసభ సీటును లాక్కోవాలనే కుట్రతోనే.. కావాలని మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవలేక, ఇలాంటి దొడ్డిదారి రాజకీయాలతో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు జగ్గారెడ్డి.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్..

## రూ.5000 కోట్ల స్కామ్‌కు చెక్!

### రూ. 5000 కోట్ల భారీ మోసానికి పోలీసులు అడ్డుకట్ట

### 'ఇగ్నైట్' పేరుతో కొత్త స్కామ్‌కు తెరలేపిన క్యూనెట్ నిర్వాహకులు

### ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్‌తో ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

### సంస్థ ఏర్పడిన 18 రోజుల్లోనే చర్యలు తీసుకున్న హైదరాబాద్ సీసీఎస్

హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5,000 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు.



'ఇగ్నైట్' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం. గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.


# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..

**కూటమి ఖాతాలోకి మరో నలుగురు ఎంపీలు**

**ప్రత్యర్థి పార్టీల నుంచి రాని నామినేషన్లు**

**టీడీపీ తరపున విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ గెలుపు**

**జనసేన నుంచి లింగమనేని రమేశ్ జయకేతనం**



ఆంధ్రప్రదేశ్ కోటాలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవం అయింది. కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ నుంచి ముగ్గురు, జనసేన పార్టీ నుంచి ఒకరిని ఆయా పార్టీల అధిష్ఠానాలు బరిలోకి దించాయి. టీడీపీ అభ్యర్థులుగా చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ నామినేషన్లు దాఖలు చేయగా, జనసేన తరపున లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎలాంటి నామినేషన్లు రాకపోగా, ఉపసంహరణ గడువు కూడా ఇవాళ్టితో ముగియడంతో ఈ నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ధృవీకరించారు.

# ఎపిలో నేటినుంచి బడిగంటలు

**రెండు నెలల విరామం తరవాత తెరుచుకుంటున్న స్కూళ్లు**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బడిగంటకు వేళాయింది. దాదాపు రెండు నెలల విరామం తర్వాత స్కూళ్లు తెరుచుకోబోతున్నాయి. శుక్రవారం నుంచి స్కూళ్లు పున:ప్రారంభం అవుతున్నాయని విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఏడాది క్యాలెండర్‌ను విడుదల చేసింది. 229 పని దినాలు, 87 రోజులు సెలవు దినాలుగా ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం విద్యాశాఖ విడుదల చేసింది. రెండు నెలల పాటు చిన్నారులు ఆటాపాటలతో ఎంజాయ్ చేశారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఇప్పుడు మళ్లీ బ్యాగ్‌లు భుజాన వేసుకుని.. పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం దగ్గర పడింది. నేటితో వేసవి సెలవులు ముగియడంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. విద్యాశాఖ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం.. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 పని దినాలు ఉండగా, 87 రోజులు సెలవులు కేటాయించారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు పాఠ్యాంశాల పూర్తి, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో దసరా, సంక్రాంతి, క్రిస్మస్ తదితర ప్రధాన పండుగల సందర్భంగా సెలవులను ప్రకటించారు. అలాగే ప్రభుత్వ సెలవులు, ఆదివారాలు కలిపి మొత్తం 87 రోజుల విరామం లభించనుంది.

# తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ రగడ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఫైర్!

**రాజకీయ లబ్ధి కోసం అంశాన్ని ఇతర పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయన్న రాంచందర్ రావు**

**ఓటర్లు తమ నియోజకవర్గాల్లోనే ఓటు వేసేలా చూడటమే దీని లక్ష్యమని వెల్లడి**

**తెలంగాణలో బీజేపీ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని వ్యాఖ్యలు**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అంశంపై బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఈ అంశాన్ని రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సిద్ధిపేట జిల్లా కుక్కునూరుపల్లి మండలం మత్పల్లిలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.గతంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగినప్పుడు బీజేపీ పూర్తి స్థాయిలో మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం విపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. "కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఈ ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. దీని ప్రధాన ఉద్దేశం ఒక్కటే.. ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్న నియోజకవర్గాల్లోనే ఓటు వేసేలా చూడటం, పారదర్శకతను పెంచడం" అని ఆయన స్పష్టం



చేశారు.తెలంగాణలో బీజేపీ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని, అందుకే ప్రజలు తమను నమ్ముతున్నారని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. రెండూ రైతులను, విద్యార్థులను, ఉద్యోగులను వంచించాయని ఆరోపించారు.

# డొనాల్డ్ ట్రంప్, సెంట్రల్ కమాండ్‌పై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు

హర్మూజ్ సమీపంలో వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయుల మృతిఈ పరిస్థితికి ట్రంప్ అనుసరిస్తున్న దూకుడు విధానాలే కారణమన్న ఒవైసీ అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో రక్షణ కల్పించడంలో




అమెరికా విఫలమయిందని విమర్శహర్మూజ్ జలసంధి సమీపంలో 'సెటెబెల్లో' వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించడంపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ ఘోర దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అంతర్జాతీయ జలాల్లో జరుగుతున్న ఈ ఉద్రిక్తతలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న దూకుడు విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఒవైసీ విమర్శించారు. అంతర్జాతీయ వివాదాలతో ఎలాంటి సంబంధం లేని మన భారతీయ నావికుల ఓడలపై దాడులు జరుగుతున్నాయని, ఈ గొడవల వల్ల మనవాళ్లు ఎంతమంది ప్రాణాలు కోల్పోతున్నారో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలని కోరారు. అదేవిధంగా, అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో రక్షణ కల్పించడంలో అమెరికా సెంట్రల్ కమాండ్ తీవ్రంగా విఫలమైందని ఒవైసీ మండిపడ్డారు. అత్యంత కీలకమైన హర్మూజ్ ప్రాంతంలో మన ఓడలపై దాడులు జరుగుతుంటే, అక్కడ కాపలా కాస్తున్న సెంట్‌కామ్‌కు ఆ మార్గంలో ఎన్ని వాణిజ్య నౌకలు ప్రయాణిస్తున్నాయో తెలియదా అని ప్రశ్నించారు.

# ఆరోగ్యశాఖలో ముగిసిన బదిలీల పక్రియ

**157 కేడర్లలో 4,869 మంది ఉద్యోగుల బదిలీ**

హైదరాబాద్: రాష్ట్ర ఆరోగ్యశాఖలో భారీ స్థాయిలో చేపట్టిన బదిలీల పక్రియ విజయవంతంగా పూర్తయింది. వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రభుత్వ వైద్య సంస్థల్లో మానవ వనరుల సమతుల్యతను కాపాడుతూ ప్రభుత్వం 157 కేడర్లలో మొత్తం 4,869 మంది ఉద్యోగులను బదిలీ చేసింది. బదిలీల్లో అత్యధికంగా పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో 2,258 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటల్లలో అవసరాలకు అనుగుణంగా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని పునర్వ్యవస్థీక రించారు. త్వరలో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ హాస్పిటల్లలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. ఎన్ఎంసీ నిర్దేశిరచిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి మెడికల్ కాలేజీలో అవసరమైన సంఖ్యలో అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా బదిలీలను



నిర్వహించింది. అదే సమయంలో ఒకే హాస్పిటల్ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఒకేసారి బదిలీ చేస్తే రోగులకు అందే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా బదిలీల పక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేసింది. పక్రియలో భాగంగా ఒకే స్టేషన్‌లో నాలుగు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులకు మాత్రమే బదిలీకి అవకాశం కల్పించింది. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పిస్తే జిల్లాల్లోని ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ విషయంలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను, జిల్లా కేంద్రాల్లోని టీచింగ్ హాస్పిటల్లను బలోపేతం చేస్తోంది. ప్రజలకు అవసరమైన వైద్య సేవల్లో దాదాపు 90 శాతం సేవలను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను పెంచుతోంది. ఇదే వ్యూహంలో భాగంగా ఇటీవల నియామకాలు పొందుతున్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందికి కూడా గ్రామీణ మరియు జిల్లా స్థాయి వైద్య సంస్థల్లోనే పోస్టింగ్‌లు ఇస్తోంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కొరత తగ్గడంతో పాటు ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించే ప్రయత్నం చేస్తోంది. హైదరాబాద్, వరంగల్ వంటి పట్టణాల్లోని ప్రభుత్వ హాస్పిటల్లకు వచ్చి ట్రీట్‌మెంట్ తీసుకునే పేషెంట్లకు రవాణా, ఇతర ఖర్చుల భారం ఉంటోంది.

# టూవీలర్‌ను ఢీకొన్న ట్యాంకర్ ఇద్దరికి తీవ్ర గాయాలు

నిజామాబాద్: ట్యాంకర్ బైక్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సిరికొండ మండల కేంద్రంలోని హుస్సేన్ నగర్ వెళ్లే దారిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిరికొండ వైపు నుంచి వస్తున్న ట్యాంకర్ తుంపల్లి వైపు నుండి బైక్ పై సిరికొండ వెళ్తున్న తూంపల్లి గ్రామానికి చెందిన సాయిలు, అశోక్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలోబైక్‌పై ఉన్న సాయిలు, అశోక్ కింద పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వారికి చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

# ఎల్‌నిలో ప్రభావంతో వర్షాభవం

**ఆరుతడి పంటలు వేసుకుంటే మంచిది**

ఖమ్మం,జూన్11:ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అధిక నీరు అవసరం ఉన్న వరి, మిరప వంటి పంటలకు బదులుగా నూనె గింజలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ రైతులకు సూచించారు. గురువారం సింగరేణి మండల పరిధిలోని పలు విత్తనాల దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. అనంతరం సీతారాంపురం, అప్పాయిగూడెం గ్రామాల్లో రైతులతో సమావేశమై వ్యవసాయ సూచనలు చేశారు. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు విత్తుకోవాలని, లైసెన్స్ పొందిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించే దిశగా యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డీఏపీకి ప్రత్యామ్నాయంగా నానో డీఏపీ వినియోగించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భట్టు అశోక్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) బి.నరేశ్, ఎస్‌కే.మున్నీ పాల్గొన్నారు.

# పారదర్శకంగానే డిఎస్సీ నిర్వహణ

**పలుమార్లు వివరణ ఇచ్చాం..ఆన్‌లైన్‌లో విరాలు పెట్టినా పదేపదే విమర్శలు**

**మరోమారు మీడియాతో కోనశశిధర్ వెల్లడి**

అమరావతి: డీఎస్సీపై రెండుసార్లు సమగ్ర వివరణ ఇచ్చినా నిరాధార ఆరోపణలే మళ్లీ మళ్లీ వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అక్టోబర్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ వస్తోందని చెప్పుకొచ్చారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. గురువారం కోన శశిధర్ మీడియాతో మాట్లాడారు. లీక్‌కు ఎలాంటి స్కోప్ లేకుండా డీఎస్సీ నిర్వహించామని స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్ అర్థం చేసుకోని వాళ్లే అనవసర విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కాల్ లెటర్ వచ్చినంత మాత్రాన ఉద్యోగం వచ్చినట్లు కాదని నోటిఫికేషన్‌లోనే స్పష్టం చేశామని అన్నారు. సర్టిఫికేట్ ధ్రువీకరణ కోసమే కాల్ లెటర్‌లు పంపిస్తామని వివరించారు.ఎక్కడైనా సెలెక్షన్ లిస్ట్ ఉంటుంది తప్ప రిజెక్షన్ లిస్ట్ ఉండదని చెప్పుకొచ్చారు. ఇంకో డీఎస్సీ కూడా వస్తున్నందున అభ్యర్థులు ఈ విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఇంకా అనుమానాలు ఉంటే కమిషనర్ కార్యాలయంలో సమాచారం కోసం అందుబాటులో ఫోన్‌నంబర్ ఉందని, అందరి అనుమానాలు నివృత్తి అవుతాయని కోన శశిధర్ పేర్కొన్నారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా విధానంపై ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎస్సీలో క్రీడా కోటా పారదర్శకంగా అమలు చేశామనటానికి అన్నీ ఆన్‌లైన్‌లో ఉంచామని స్పష్టం చేశారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/